# చవితి వేడుకలకు సంసిద్ధం

- గణపతి నవరాత్రులకు సిద్ధమవుతున్న భక్తులు
- విగ్రహాల తయారీలో కళాకారులు బిజీ
- గ్రామాల్లో మండపాల ఏర్పాటుకు చర్యలు
- మట్టి విగ్రహాలే మేలు అంటున్న మేధావులు



సామర్లకోటలో మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్న కుటుంబం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణపతి విగ్రహాలు

సామర్లకోట: గ్రామాల్లో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. పలు రూపాల్లో వినాయక విగ్రహాల తయారీలో కళాకారులు బిజీగా ఉన్నారు. కాగా వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలు తమ పరిశ్రమలు, షాపుల్లో వినాయక చవితి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లో వినాయక మండపాలకు జోరుగా ఏరాట్లు జరుగుతున్నాయి.

**జోరుగా ప్రతిమల తయారీ**

వినాయక ప్రతిమలు తయారు చేయడంతో కళాకారులు బీజీగా ఉన్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన ఒక కుటుంబం స్థానిక ఐదు తూముల వద్ద పాతవంతెనపై గుడారాలు ఏర్పాటు చేసుకొని 14 ఏళ్లుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముంపు పొంచి ఉందనే వాదనలు ఉన్నాయి. ఒక్క అడుగు నుంచి 10 అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు. పలు రకాల రూపాలతో విగ్రహాలను తయారు చేస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఈ మేరకు ప్రజలను ఆకర్షించే విధంగా రంగులు వేస్తున్నారు.

**మట్టి విగ్రహాలపై చైతన్యం**

గణపతి నవరాత్రులు పూర్తయిన తరువాత స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గోదావరి కాలువ, ఏలేరు కాలువ, సముద్రంలో నిమజ్జనం చేస్తారు. ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేసే సమయంలో మట్టి విగ్రహాలు నీటిలో కరిగిపోతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలని అధికారులు, పర్యావరణ వేత్తలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరగడంతో వాటిని తయారు చేయడంలో కళాకారులు బీజీగా ఉన్నారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణంతో పాటు గ్రామాల్లోని ప్రధాన సెంటర్లు, యూనియన్ కార్యాలయాల వద్ద గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు.

### కులవృత్తిపై ఆధారపడి జీవనం



కులవృత్తిగా చిన్నప్పటి నుంచి బొమ్మల తయారీపై ఆధారపడి జీవిస్తున్నాం. గణపతి విగ్రహాలతో పాటు పెళ్లిలకు కావలసిన విగ్రహాలు, వీరభద్రుని సంబరానికి విగ్రహాలు, మట్టి డిబ్బీలు తయారు చేస్తాం. ఇటీవల బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేస్తే అర్హత ఉందని బ్యాంకు అధికారులు చెప్పినా రాజకీయ నాయకులు సిపార్సులు లేకపోవడం వలన బ్యాంకు రుణం అందలేదు. మేము నాలుగు అంగులాల నుంచి నాలుగు అడుగుల వరకూ విగ్రహాలను తయారు చేస్తాం. వీటి ధర రూ.10 నుంచి రూ.10 వేల వరకూ ఉంటుంది. జి. రాగంపేట చెరువులో మట్టితో విగ్రహాలను తయారు చేస్తున్నాం. విగ్రహాల సైజ్‌ను బట్టి ఒక మనిషి రోజుకు 50 నుంచి 60 విగ్రహాలు తయారు చేస్తారు.

కర్రి అప్పలరాజు, మట్టి విగ్రహాల తయారీదారుడు, సామర్లకోట

### పర్యావరణాన్ని పరిరక్షించాలి



గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని మట్టి గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించడం కోసం గత 15 ఏళ్లుగా పీబీదేవం గ్రామానికి చెందిన శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాం. ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలి.

తోటకూర గంగాధర్, పర్యావరణ పరిరక్షణ జాతీయ అవార్డు గ్రహీత, సామర్లకోట

### మట్టి విగ్రహాలనే వాడాలి

వినాయక చవితికి ప్రతీ ఒక్కరూ మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. ఈ మేరకు పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలకు అవగాహన పెంచడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకొంటాం. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలు తయారు చేసే వారిపై నిషేధ ఉత్తర్వులు జారీ చేస్తాం. భావితరాలకు స్వచ్ఛమైన తాగునీరు, పర్యావరణాన్ని అందించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది.

కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్, సామర్లకోట

## గణపతి నవరాత్రులకు రాట ముహూర్తం



మర్లావలో పందిరి రాట వేస్తున్న వైస్ ఎంపీపీ రాజా

పెద్దాపురం: ఈ నెల 27 నుంచి గణపతి నవరాత్ర ఉత్సవాలకు భక్తులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. మండలంలోని మర్లావలో వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ, ఆలయ కమిటీ చైర్మన్ మిరియాల రాజా దంపతుల చేతుల మీదుగా ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు గణేష్ నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కామన రామకృష్ణ, కాతా పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సవాలకు పందిరి రాట**

కొత్తపల్లి: గణపతి నవరాత్ర మహోత్సవాలకు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాట ముహూర్తం చేశారు. వాకతిప్పలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రులు సందర్భంగా ఆలయాల వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి విగ్రహాలు ఏర్పాటు చేయనున్న మందిరాల వద్ద ముత్తైదువులు పూజలు చేశారు.

## క్లుప్తంగా

### మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో భక్తులకు అన్నదానం

పెద్దాపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వారంవారం నిర్వహించే అన్నదానానికి భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గత నెల ఆషాఢ మాస జాతర ఉత్సవాల్లో భాగంగా అన్నదానాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఈ వారం నుంచి మళ్లీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమ్మవారి అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు

### గోతుల పూడ్చివేత



సామర్లకోట-కాకినాడ రోడ్డులో గోతులు పూడ్చివేత పనులు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డు ఛిద్రమై గోతులమయంగా మారింది. ఆదివారం కురిసిన వర్షానికి గోతుల్లో నీరు చేరి వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బందితో గోతులు పూడ్చివేత పనులు ప్రారంభించారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి గూడ్సు షెడ్ నుంచి ఐదు తూముల వరకూ గోతుల్లో రాళ్లు వేయించి గ్రావెల్‌తో పూడ్చారు. చిన్నవాహన చోదకులు గోతులను గమనిస్తూ రాకపోకలు సాగించారు.

### ఎడతెరిపి లేకుండా వర్షం

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రావణమాసం కావడంతో ఒక వైపు వివాహాల సందడి, మరో వైపు గృహ ప్రవేశాలు, రిసెప్షన్లు, పెళ్లి చూపుల వేడుకలకు ఏర్పాట్లు చేసుకున్న వారు ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసేవారు రాకపోకలకు అవస్థలు పడ్డారు. పెళ్లిళ్లకు కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేసుకోవడంతో కొంత మేరకు ఊరట చెందినా గృహ ప్రవేశాలు, పెళ్లి చూపులు ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న వారు వర్షంతో ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి తెరిపివ్వకుండా వర్షం పడుతూనే ఉండటంతో మట్టి నిర్మాణాలు తడిసి ముద్దయ్యాయి. ఆదివారం కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే వారు ఇళ్ల వద్దనే కాలక్షేపం చేశారు.

### సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

**మున్సిపాలిటీ**

| | |
|---|---|
| మున్సిపల్ కమిషనర్ | 98499 05808 |
| మున్సిపల్ మేనేజర్ | 98499 07118 |
| మున్సిపల్ డీఈ | 96769 68282 |
| మున్సిపల్ ఏఈ | 98499 07122 |
| మున్సిపల్ ఆర్వో | 98499 07120 |
| మున్సిపల్ ఆర్ఐ | 90146 00920 |
| మున్సిపల్ టీపీఓ | 98499 07123 |
| శానిటరీ ఇన్‌స్పెక్టర్ | 77024 48282 |
| అకౌంట్స్ ఆఫీసర్ | 98499 02447 |

**ప్రభుత్వాస్పత్రి**

| | |
|---|---|
| సూపరింటెండెంట్ | 80082 88125 |
| పశు సంవర్థక శాఖ ఏడీ | 94418 60299 |
| తహసీల్దార్ | 98499 03876 |
| ఎంఈఓ-1 | 85558 71069 |
| ఎంఈఓ-2 | 94410 73418 |

### కొత్తపల్లి మండల అధికారులు

| | |
|---|---|
| తహసీల్దార్ | 91542 47464 |
| ఎంపీడీఓ | 94401 13090 |
| ఇంజినీర్ | 99890 78030 |
| ఎలక్ట్రికల్ ఏఈ | 94408 12642 |
| హౌసింగ్ ఏఈ | 70939 30455 |
| ఈఓపీఆర్డీ | 99489 27333 |
| ఉపాధి హామీ పథకం ఏపీఓ | 83744 46378 |
| డ్వాక్రా ఏపీఎం | 89788 81622 |
| ఎస్సై | 94409 00752 |
| సీఐ పిఠాపురం | 94407 96523 |
| వ్యవసాయ శాఖ ఏఓ | 83310 56594 |
| కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్ | 99890 69546 |
| నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్ | 98497 28671 |
| కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్ | 92466 90633 |
| ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ | 89858 28380 |
| ఎంఈఓ | 92467 34465 |
| ఐసీడీఎస్ సీడీపీఓ | 94408 14692 |
| ఇరిగేషన్ జేఈ | 83310 75078 |

## చవితి ఉత్సవాలను భక్తిభావంతో నిర్వహించాలి



ఉత్సవాల నిర్వహణపై చర్చిస్తున్న నాయకులు

పిఠాపురం: త్వరలో ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలను భక్తిభావంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య సూచించారు. పిఠాపురం జై గణేష్ ఆలయంలో ఆదివారం నిర్వహించిన గణేష్ ఉత్సవ సమితి జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గణపతి ఉత్సవాలు నిర్వహించే వారికి కమిటీ తరఫున సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా భక్తి భావంతో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. నిమజ్జనాల సమయంలో ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గణేష్ ఉత్సవ సమితి జిల్లా నాయకులు దూసర్లపూడి రమణరాజు, దువ్వూవరి సుబ్రహ్మణ్యం తదితరులు గణపతి ఉత్సవాల మండపాల ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పిఠాపురం నియోజకవర్గ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా పిఠాపురానికి చెందిన బీజేపీ సీనియర్ నేత బుర్రి మురళీధరరావును నియమించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యడ్ల ప్రభాకరరావు, అడబాల మోహనరావు, యాళ్ల కృష్ణారావు, ఏలూరు సూర్యనారాయణ, పంపన శేషగిరిరావు, డీవీఎస్ రాజు, బండే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలు

పెద్దాపురం: పట్టణంలో ఏపీయూడబ్ల్యూజే 68వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఐజేయూ సభ్యుడు రాకుర్తి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నియోజకవర్గ యూనియన్ సభ్యులందరూ భాగస్వాములయ్యారు. స్థానిక రామారావుపేటలో యూనియన్ పతాకాన్ని సీనియర్ జర్నలిస్టు వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐజేయూ సభ్యులు రాంబాబు, వెంకట్రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. యూనియన్ బలోపేతంతో పాటు పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసి సత్వరమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు అడపా వెంకట్రావు, ఉప్పలపాటి చంద్రదాస్‌లను యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి చవ్వాకుల ఈశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఎలిశెట్టి సత్యనారాయణ, గోవిందలపూడి సుబ్రహ్మణ్యం, ఎన్‌పీఎస్ వినాయక్, బిక్కిన వెంకట్, ఎన్.శ్రీరామ్, రాయవరపు వీరబాబు, బొదిరెడ్డి బుజ్జిబాబు, పెమ్మాడి వీరభద్ర వర్మ, మొల్లు సూర్యనారాయణ, పి.సత్య గంగాధరం, సిద్ధిరెడ్డి సూరిబాబు, ఫర్ ద పీపుల్ ఫౌండేషన్ చైర్మన్ గుణ్ణం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

- దేవతామూర్తుల వేషధారణలతో ఎడ్లబండ్లపై ఊరేగింపు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



సామర్లకోటలో దేవతామూర్తుల వేషధారణలతో ఎడ్ల బండ్లపై ప్రదర్శన

సామర్లకోట: స్థానిక విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా వేంచేసిన రాధాకృష్ణుల ఆలయంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వర్షంలో సైతం భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజప్ప, దొరబాబులను ఆలయ కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

**ఉత్సాహంగా ఊరేగింపు**

భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి దేవతామూర్తుల వేషధారణలు వేశారు. ఎడ్లబండ్లపై వివిధ దేవతామూర్తుల వేషధారణలతో సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల నడుమ వర్షంలోనూ ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. కోలసంబరం, కోలాటం వివిధ వేషధారణలు ఏర్పాటు చేశారు. కోలసంబరాన్ని దవులూరి దొరబాబు ప్రారంభించారు. రాధా సమేత వేణుగోపాల స్వామి ఆలయం నుంచి మఠంసెంటర్, అయోధ్యరామపురం, కొత్తూరు, ప్రెసిడెంట్‌గారి వీధి, స్టేషన్‌సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, బళ్లమార్కెట్ సెంటర్, యార్లగడ్డవారి వీధి, రత్నంరాజు ఆస్పత్రి, వీర్రాఘవపురం మీదుగా ఆలయానికి ఊరేగింపు చేరింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కౌన్సిలర్ నమ్మి సూర్య దుర్గ, ఆలయ కమిటీ నాయకులు నమ్మి శ్రీనివాసు, దారబాల సూరిబాబు, మార్ల సూర్యనారాయణ, మార్ల రాంబాబు, నమ్మి అప్పారావులు భక్తులకు సేవలందించారు.



సామర్లకోటలో స్వామివారిని దర్శించుకుంటున్న దవులూరి దొరబాబు



రాధాకృష్ణుల దర్శనానికి బారులు తీసిన భక్తులు

### సత్యదేవుని పల్లకీ సేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల పల్లకీ సేవ ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తూర్పురాజగోపురం లోపల ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అర్చకులు కంబిపల్లి సాయి స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి పల్లకీ సేవ ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను మూడుసార్లు ఆలయ ప్రాంగణంలో పల్లకీపై ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కాగా ప్రతి ఆదివారం స్వామి, అమ్మవార్లను టేకు రథం మీద ఊరేగిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఈ వారం వర్షం కురుస్తుండడంతో రథసేవ రద్దు చేసి పల్లకీమీద గోపురం లోపల ప్రాకారంలో స్వామి, అమ్మవారిని ఊరేగించారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం



కిర్లంపూడిలో కంటి వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: స్థానిక సాంబశివ ఆసుపత్రిలో గ్రామ మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు అధ్యక్షతన ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం సందర్శించారు. కిరణ్ కంటి ఆసుపత్రి డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. తోట నరసింహం రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వైద్యుడు వేగి సాంబశివ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తోట బాబ్జీ, నియోజకవర్గ ఇంటిలెక్చువల్ విభాగం అధ్యక్షుడు వేగి రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు పెనగంటి రాజేష్, అడారి మహేష్, కర్రి వెంకట రమణమూర్తి, పీలా సుబ్రహ్మణ్యం, మక్కా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫొటో ట్రెండ్.. ఫుల్ డిమాండ్





మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల కస్టమైజ్ గిఫ్ట్‌లు



- కస్టమైజ్ గిఫ్ట్‌లకు పెరుగుతున్న ఆదరణ
- అన్నివర్గాలకూ అందుబాటులో ధరలు

బోట్‌క్లబ్: బంధువులు, స్నేహితులు గతంలో బహుమతులు ఇవ్వాల్సి వస్తే ఇంటిలో అలంకరించుకొనే వస్తువులే ఇచ్చేవారు. ఇంటిలో పెట్టుకొనేందుకు దేవుడు బొమ్మలు, గోడ గడియారాలు, సీనరీలు వంటివి ఎక్కువ ఉండేవి. కానీ ప్రస్తుతం ట్రెండ్ మారింది. వారి ఫొటోలను వారికే బహుమతులు అందిస్తున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో కస్టమైజ్ గిఫ్ట్‌లకు మంచి గిరాకీ వచ్చింది. మనం ఎవరికైతే బహుమతి ఇవ్వాలనుకుంటున్నామో వారికి బొమ్మలతో కూడిన బహుమతులు అందిస్తున్నారు. ఈ గిఫ్ట్‌లు రకరకాలు అందుబాటులోనికి వచ్చాయి. తలగడ దిండు, టీ కప్పులపై ఫొటోలు, వాల్‌పై పెట్టుకొనే రకరకాల డిజైనర్‌లో గిఫ్ట్‌లు ఉన్నాయి. గిఫ్ట్ డిజైన్‌లో భాగంగా ఫొటోలు పెట్టేందుకు వాటిని సేకరించడం పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఫంక్షన్లు, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు షేర్ చేస్తున్నారు. వాటిని భద్రపరుచుకొని వారి ఇంటిలో పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి శుభకార్యాలకు వారి ఫొటోలతో అందంగా తయారు చేసిన బహుమతులను ఇవ్వడంతో వాటిని చూసి వారు మురిసిపోతున్నారు. దీంతో నగరంలో ఈ కస్టమైజ్ గిఫ్ట్‌లు షాపులకు గిరాకీ పెరిగింది. గతంలో కాకినాడలో రెండు మూడు షాపులు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం వీటికి మంచి గిరాకీ రావడంతో 10కిపైగా షాపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీరికి చేతినిండా పనిదొరుకుతోంది.

**కంప్యూటర్‌పై ప్రింటింగ్‌తో నాణ్యత**

ఎదుట వారికి ఇచ్చే బహుమతులు వారి ఫొటో మనం ఇస్తే ఆ ఫొటో నాణ్యతతో తగ్గకుండా కంప్యూటర్‌పై ప్రింటింగ్ చేయడంతో రకరకాలు స్టైల్స్‌లో మనకు కస్టమైజ్ గిఫ్ట్‌లు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. గోడకు తగిలించుకొనే బొమ్మలతోపాటు, కార్లలో పెట్టుకొనే దిండులు ఇలా రకారకాల డిజైన్‌లో ఈ కస్టమైజ్ గిఫ్ట్‌లను కంప్యూటర్ ద్వారా ప్రింట్ చేస్తున్నారు.

**రెండేళ్ల క్రితం నష్టాలే..**

రెండు సంవత్సరాలు క్రితం కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో కస్టమైజ్ గిఫ్ట్ షాపులు వచ్చినప్పటికీ అంత వ్యాపారం లేక వ్యాపారులు డీలా పడ్డారు. వినియోగదారులు వీటికి పెద్దగా తెలియకపోవడంతో బేరాలు లేక షాపు యజమానులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. బహుమతులు ఇచ్చివారు అందుబాటులో లేకపోయినా తమ బంధువుల ఫొటోలు పెట్టి వారికి నచ్చిన గిఫ్ట్ ఇచ్చేలా ఆన్‌లైన్ సర్వీస్‌లు అందుబాటులోకి తెచ్చారు. డబ్బులు సైతం ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటు రావడంతో వారు ఇక్కడకు వచ్చి గిఫ్ట్‌లు ఇచ్చే పరిస్థితి కూడా లేకపోవడంతో అంతా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకొని వారి బంధువులకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వీరికి మంచిగా వ్యాపారం సాగుతోంది.

### పెరిగిన బేరాలు



రెండేళ్లు అసలు బేరాలు ఉండేవి కాదు. సిబ్బందికి, షాపు అద్దెలు చెల్లించేందుకు ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం కస్టమైజ్ గిఫ్ట్‌లు తమ బంధువులు, స్నేహితులకు ఇచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో బేరాలు బాగా వస్తున్నాయి. ఆన్‌లైన్ వారికి కావాల్సిన గిఫ్ట్‌లు పంపే ఏర్పాట్లు చేశాం.

– సాయి, కస్టమైజ్ గిఫ్ట్ షాపు, నిర్వాహకుడు

### గిఫ్ట్‌లు బాగున్నాయి



ప్రస్తుతం మార్కెట్‌లోకి వచ్చిన కస్టమైజ్ గిఫ్ట్‌లు బంధులువు, స్నేహితులకు ఇచ్చేందుకు ఎంతో బాగుంటున్నాయి. మనం ఇచ్చే బహుమతిని చూసి వారి చాలా ఆనందంగా వ్యక్తం చేస్తున్నారు. మనకు కావాల్సిన రేటులో కూడా మనకు కస్టమైజ్ గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఆన్‌లైన్ ద్వారా కూడా పంపిస్తున్నారు.

– అంకంరెడ్డి రామునాయుడు, కస్టమైజ్ గిఫ్ట్ కొనుగోలుదారుడు

### సత్యదేవుని దర్శించిన జిల్లా ఎస్పీ



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న ఎస్పీ బిందు మాధవ్ దంపతులు

అన్నవరం: జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.